# రూ.లక్షల్లో వ్యయం.. ఫలితం శూన్యం

- టెక్కలి మేజర్ పంచాయతీలో అంధకారం
- సక్రమంగా వెలగని వీధిలైట్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

టెక్కలి:

టెక్కలి మేజర్ పంచాయతీలోని పలు వీధుల్లో చిమ్మచీకట్లు అలముకుంటున్నాయి. పంచాయతీ పరిధిలో వీధి దీపాలు సక్రమంగా పనిచేయకపోవడంతో రోజుల తరబడి ఆయా వీధులు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడుతున్నారు.

**ఏటా రూ.10 లక్షల వ్యయం**

టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో సుమారు 200కు పైగా వీధుల్లో 40 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం సుమారు 2,400 విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. వాటికి పంచాయతీకి చెందిన 2,250 విద్యుత్ దీపాలు ఉన్నట్లు చెబుతున్నారు. వీటి కోసం ప్రతీ ఏడాది రూ.10 లక్షలకు పైగా నిధులు ఖర్చు చేస్తున్నారు. అయితే అధికారులు చెప్పిన లెక్కలకు, వీధుల్లోని దీపాల పరిస్థితులకు పొంతన లేకుండా పోతోంది. వాస్తవంగా వీధి దీపం మరమ్మతులకు సంబంధించి రెండు లేక మూడు రోజుల్లో మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. కానీ కొన్ని వీధుల్లో నెలల తరబడి వీధి దీపాలు మరమ్మతులు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉండగా పాత జాతీయ రహదారిలో జగతిమెట్ట జంక్షన్ నుంచి పలాస రూట్ ఫ్లై ఓవర్ వరకు ఉన్నటువంటి సెంట్రల్ లైటింగ్‌కు కొద్ది నెలల క్రితం సుమారు రూ.30 లక్షల అంచనా వ్యయంతో మరమ్మతులు చేపట్టినట్లు పంచాయతీ అధికారులే చెబుతున్నారు. అయితే ఆయా సెంట్రల్ లైటింగ్ సైతం పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. ఏది ఏమైనప్పటికీ టెక్కలి మేజర్ పంచాయతీలో వీధి దీపాల నిర్వహణకు లక్షల్లో ఖర్చు చూపిస్తున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదనే విమర్శలు బాహాటంగా ఉన్నాయి. ప్రస్తుతం వేసవికాలం దృష్ట్యా దొంగతనాలు జరగకుండా సక్రమంగా నిర్వహణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



టెక్కలి మేజర్ పంచాయతీ కార్యాలయం



పూర్తిస్థాయిలో వెలగని పాత జాతీయ రహదారి సెంట్రల్ లైటింగ్

### ఆదేశాలు జారీ చేశాం



టెక్కలి మేజర్ పంచాయతీలో వీధి దీపాల నిర్వాహణపై సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ప్రస్తుతానికి స్టాకు సమస్య ఉంది. పంచాయతీ పరిధిలో ఏ వీధుల్లో వీధి దీపాలు వెలగడం లేదో వివరాలు సేకరించమని చెప్పాం. మరికొద్దిరోజుల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో వీధి దీపాలు నిర్వహణ చేపట్టేవిధంగా చూస్తాం.

– జి.వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి (ఎఫ్ఏసీ), టెక్కలి మేజర్ పంచాయతీ

### అస్తవ్యస్తం



టెక్కలి మేజర్ పంచాయతీలోని పలు వీధుల్లో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. కొన్ని వీధుల్లో పగలు, రాత్రి తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతుంటే, మరి కొన్ని వీధుల్లో నెలల తరబడి వీధి దీపాలు వెలగడం లేదు. వీధి దీపాల కోసం రూ.లక్షలు ఖర్చు చేస్తున్నప్పటికీ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ వేసవిలో దొంగతనాలు జరగకుండా పంచాయతీలో పూర్తిస్థాయిలో వీధి దీపాలు వెలిగేవిధంగా చూడాలి.

– డి.ధర్మారావు, వార్డు సభ్యుడు, టెక్కలి మేజర్ పంచాయతీ

## క్లుప్తంగా

### ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలు

కంచిలి: విద్యాహక్కు చట్టం–2009 ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికి మండల పరిధిలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలకుగాను ప్రకటన విడుదల చేసినట్లు ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబులు గురువారం తెలిపారు. ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఈనెల 28 నుంచి మే 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. దీనికోసం అర్హులైనవారు ప్రాథమిక వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం 18004258599సంప్రదించాలని సూచించారు.

### ఆర్డర్ కాపీల అందజేత



ఆర్డర్ కాపీలు అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో ఉన్నటువంటి ఎంఐజీ లేఅవుట్ –1లో దరఖాస్తు చేసుకొని, ఆన్‌లైన్ డ్రాలో అర్హత సాధించినవారికి ఆర్డర్ కాపీలను గురువారం అందజేశారు. 240, 200, 150 చదరపు గజాల ప్లాట్ల అలాట్‌మెంట్ ఆర్డర్స్ మున్సిపల్ మెప్మా హాల్‌లో ఏపీటీసీ చైర్మన్ వజ్జ బాబురావు చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో సుడా పీవో అమర్‌నాథ్, మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు మోహన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాకారిణులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం టౌన్: పట్టణంలోని కేజీబీవీలో చదువుతున్న జి.అంజలి, పి.హైమావతిలు ఇటీవల జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. దీంతో వారికి అలయన్స్ క్లబ్ సభ్యులు రూ.6 వేల ఆర్థిక సాయం గురువారం అందజేశారు. ఈనెల 26 నుంచి జార్ఖండ్ రాజధాని రాంచిలోని జైపాల్‌సింగ్ స్టేడియంలో జరగనున్న పోటీలకు వీరు వెళ్లనున్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎల్.నరసింహమూర్తి, సభ్యులు డి.గోపినాథ్ రెడ్డి, వెంకటరమణ, బాలకృష్ణ, బుజ్జి, బి.రామారావు, పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

### టెక్కలి క్రీడాకారుల ప్రతిభ



విజేతలకు పతకాలు అందజేస్తున్న నిర్వాహకులు

టెక్కలి రూరల్: ఏలూరు జిల్లా తోటపల్లిలో ఈ నెల 21, 22, 23వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో టెక్కలికి చెందిన ఎం.కుమారస్వామి, ఎం.దివ్య, ఎల్.దిలీప్, దినేష్ పట్నాయక్ సత్తాచాటారు. 100, 200 మీటర్ల పరుగు పోటీలో జిల్లా తరపున పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. మొత్తం 148 మంది వైకల్యం గల పిల్లలు హాజరుకాగా, సీడబ్ల్యూఎస్ఎన్ విభాగంగలో వీరు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు.

### ఉగ్రదాడి దారుణం



కాశీబుగ్గ: పలాస సీతారామాలయం వద్ద కొవ్వొత్తులతో నివాళి

కాశీబుగ్గ/సోంపేట: జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. గురువారం ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దహనం చేశారు. ఉగ్రవాదుల దుశ్చర్యను తీవ్రంగా ఖండించారు. మరణించిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. కాశీబుగ్గ, సోంపేటల్లో కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టి నివాళులర్పించారు.

### ఆక్రమణల తొలగింపు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పాత జాతీయ రహదారి అక్కుపల్లి రోడ్డు కూడలితో పాటు పలుచోట్ల అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు గురువారం తొలగించారు. దీనిపై దుకాణదారులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

### గంగమ్మ తల్లికి పూజలు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం బజారు వీధిలో లక్ష్మీనృసింహ ఆలయం ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక బహుదా నదిలో భక్తులు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంట్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని కలశయాత్ర చేపట్టారు. అనంతరం లక్ష్మీనృసింహ స్వామివారి విగ్రహాలకు జలాభిషేకం జరిపారు.

# లోక్ అదాలత్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నిర్మల

టెక్కలి: మే 10వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజీమార్గంపై కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కేసుల నుంచి విముక్తి కలిగే విధంగా చూడాలని వెల్లడించారు. సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్ఆర్ తేజచక్రవర్తి మల్ల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్, ఏపీపీ కె.సుధారాణి, న్యాయవాదులు డి.వి.వివేకానంద, పి.బాబురావు, బి.గౌరీపతి, పి.చంద్రుడు, బి.కృష్ణమూర్తి, పి.వైకుంఠరావు, ఎస్.రమణారావు, ఐ.మల్లేశ్వరరావు, పి.బాలకృష్ణ, పి.సాయిరాజు, ఎస్.రాజన్నాయుడు, ఎస్.ధర్మరాజు, జి.కృష్ణారావు, ఎం.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# జీవామృతంతో అధిక ప్రయోజనాలు



జీవామృతం తయారీని వివరిస్తున్న శీర కామరాజు

కంచిలి: ప్రకృతి వ్యవసాయంలో జీవామృతం వినియోగంతో అధిక ప్రయోజనాలు కలుగుతాయని ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జి శీర కామరాజు పేర్కొన్నారు. మండలంలోని గోకర్ణపురం యూనిట్ జలంత్రకోటలో నౌరియా దుదిష్టికి చెందిన బీర, దొండపాదుల సాగుకోసం 400 లీటర్ల జీవామృతం తయారీని శీర కామరాజు గురువారం చేపట్టి, స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. దీనికి కావల్సిన పదార్థాలు, తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. ఇలా తయారు చేసిన మిశ్రమాన్ని కర్ర సాయంతో సవ్య దిశలో ఉదయం, సాయంత్రం వేళల్లో నాలుగు రోజులపాటు బాగా కలిపివేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్పీ బల్లేటి నారాయణరావు, ఎఫ్ఎస్ చెంచుల తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు



వేసవి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న దృశ్యం

పలాస: మండలంలోని బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత వేసవి శిక్షణా తరగతులను విద్యార్థులకు నిర్వహిస్తున్నామని హెచ్‌ఎం వీర్రాజు తెలియజేశారు. ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, గ్రామర్‌ను 45 రోజులు పాటు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూవీవీ అధ్యక్షుడు బొమ్మల శివ, కార్యదర్శి గౌరకల లోకేశ్వరరావు, పోతనపల్లి గీతమ్మ, కుత్తుం ప్రకాష్, బొడ్డు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన సాహిత్య పోటీలు



విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కళాశాల అధ్యాపకులు

టెక్కలి: విద్యతో పాటు సాహిత్యం అవసరమని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరక్టర్ వి.వి.నాగేశ్వరరావు అన్నారు. కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి సాహిత్య పోటీలు గురువారం ముగిశాయి. పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల నుంచి సుమారు 350 విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఫ్లాష్ ఫిక్షన్ విభాగంలో చెన్నైకు చెందిన ఎస్ఆర్ఎం కళాశాల విద్యార్థి జి.వివేక్‌వర్ధన్ మొదటి బహుమతి సాధించారు. ఆదిత్య కళాశాలకు చెందిన ఎ.సుధారాణి, వి.హర్షలు ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. స్క్రీన్‌ప్లే రైటింగ్ పోటీల్లో ఆదిత్య విద్యార్థులు కె.నిఖిల, పి.ఆర్.రోహిత్ మొదటి, రెండవ బహుమతులు సాధించారు. ఎచ్చెర్ల శివానీ కళాశాల మూడో బహుమతి సాధించింది. డ్రామాటిక్, ఫిల్మ్ రివ్యూ, లిటరసీలో ఆదిత్య కళాశాలకు చెందిన మృదుల బృందం, డి.ప్రియా, కె.షర్మిల, కె.నవీన్‌కుమార్, పి.కృపారాణి, కె.జ్ఞానేశ్వర్, పి.ప్రవీణ్ తదితర విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు రత్నమణి, ఎం.రమణయ్య, పాపినాయుడు, ఎస్.శైలజ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బాలకృష్ణాపురం జంక్షన్‌లో రోడ్డు ప్రమాదాలపై ఎస్ఐ ఈ.శ్రీనివాస్ గురువారం అవగాహన కల్పించారు. అలాగే ఆన్‌లైన్ మోసాలు, గృహహింసా చట్టాలను వివరించారు. వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం, మత్తు పదార్థాలను సేవించి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకొని, వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం మహిళలు, విద్యార్థినులతో సఖీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి, ఉపయోగాలను తెలియజేశారు.

# ఈనెల 27న స్కాలర్‌షిప్ టెస్టు



ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఆహ్వానం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

సోంపేట: మండలంలోని ఇస్కలపాలేం గ్రామానికి చెందిన ఎస్ఎస్‌వీవైఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన స్కాలర్ షిప్ టెస్టు నిర్వహించనున్నారు. ఈ మేరకు మండలంలోని పలు పాఠశాలలకు గురువారం వెళ్లి ఆహ్వానాలు అందజేశారు. తొమ్మిదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థుల విద్యాభ్యాసం కోసం రూ.20 వేల నగదు ప్రోత్సాహం అందజేయనున్నట్లు తెలియజేశారు. మరిన్ని వివరాలకు 79954 97677, 63027 58775 నంబర్లను సంప్రదించాలన్నారు.

# విద్యార్థులకు అభినందనలు



సోంపేట: శావ్యలలితాంజలిని సత్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు



ఇచ్ఛాపురం రూరల్: అంజలిని సత్కరిస్తున్న ఎంఈవోలు

ఇచ్ఛాపురం రూరల్: పదో తరగతి ఫలితాల్లో ఒడియా మాధ్యమంలో డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన అంజలి బెహరాను స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఎంఈవోలు కురమాన అప్పారావు, ఎస్.విశ్వనాథంలు అభినందించారు. రానున్న రోజుల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అంజలి మండలంలోని ఈదుపురం కంద్రావార్డు ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి, ఇటీవల విడుదలైన ఫలితాల్లో 589 మార్కులు సాధించింది. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని కొర్లాం గ్రామానికి చెందిన సీహెచ్ శావ్యలలితాంజలి పదో తరగతి ఫలితాల్లో 597 మార్కులతో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించింది. దీంతో గ్రామానికి చెందిన జాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినిని గురువారం సత్కరించారు. విద్యార్థిని తండ్రి సూర్యనారాయణ గొనకపాడు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో జాగృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి, సచివాలయ కార్యదర్శి ఎ.వరలక్ష్మి, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆపదలో ఆదుకున్నారు

మందస/కాశీబుగ్గ: మందస మండలం గుడ్డికోలా గ్రామానికి చెందిన సవర కుమారి పురిటినొప్పులతో బాధపడుతూ 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. వెంటనే బయలుదేరిన సిబ్బంది ఘటనా స్థలానికి చేరేసరికే నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ ఉప్పాడ గోపాలకృష్ణ స్పందించి ఇంట్లోనే ప్రసవం చేయించారు. తల్లీబిడ్డలకు ప్రాథమిక చికిత్స అందించి అంబులెన్సులో సిరిపురం పీహెచ్‌సీకి తరలించారు.ఈఎంటీతో పాటు పైలట్ వావిలాపల్లి మురళీమోహన్‌రావులకు గ్రామస్తులు అభినందించారు.

## ముగిసిన యజ్ఞం



ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి బెల్లుపడలో జరిగిన శ్రీరామతారక మహామంత్ర సహిత పంచకుండాత్మక యజ్ఞం గురువారం జల విసర్జన కార్యక్రమంతో ముగిసింది. యజ్ఞం ప్రారంభానికి ముందురోజు బాహుదా నది నుంచి కలశాలతో తీసుకొచ్చిన పవిత్ర జలాలను ఏడు రోజులు పూజలో ఉంచి, యజ్ఞం పూర్తవ్వడంతో మరలా బాహుదా నదిలో సామూహికంగా వెళ్లి కలిపారు. – ఇచ్ఛాపురం టౌన్

## ఉత్సాహంగా వార్షికోత్సవం



వజ్రపుకొత్తూరు మండలం పెదవంక ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బత్తిని సృజన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. వివిధ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం బళ్ల సుభాష్, పాఠశాల కమిటీ చైర్మన్ లలిత కుమారి, గ్రామ కమిటీ అధ్యక్షుడు బి.రామారావు తదితరులు పాల్గొన్నారు. – వజ్రపుకొత్తూరు

## వరి కోతలు ప్రారంభం



గతేడాది ఖరీఫ్ సీజన్‌లో పంటల దిగుబడులు తగ్గిన నేపథ్యంలో రబీ వరిసాగు చేపట్టిన రైతులకు పంట చేతికందింది. కవిటి మండలంలోని బీల ప్రాంతంలో ఈ ఏడాది సుమారు 300 ఎకరాల్లో రబీ వరిసాగు ఫైన్ క్వాలిటీ(సన్నరకాలు) సాగు చేశారు. ప్రస్తుతం ఈ వరిపైరు పండి చేతికి అందింది. దీంతో కోతలు ప్రారంభమయ్యాయి. అయితే కూలీల ధరలు పెరగడంతో యంత్రాలవైపే రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. – కవిటి

# ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



కవిటి: ఎంపీపీ కడియాల పద్మను సత్కరిస్తున్న దృశ్యం



కంచిలి: మాట్లాడుతున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి



పలాస: బొడ్డపాడు ఎంపీటీసీ పాపారావుకు సన్మానం



టెక్కలి: పంచాయతీ కార్యదర్శి రవికుమార్ రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ సరోజనమ్మ తదితరులు

జిల్లావ్యాప్తంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ వ్యవస్థే కీలకమైనదన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన నాయకులు, అధికారులను సన్మానించారు. పంచాయతీల అభివృద్ధికి సమన్వయంతో పనిచేద్దామని పిలుపునిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్

# విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

టెక్కలి: మండలంలోని రావివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి టౌన్–1, 2 ప్రాంతాలు, కె.కొత్తూరు, రావివలస, లింగాలవలస, తలగాం, బన్నువాడ, విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం పరిధి ప్రాంతాల ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వెల్లడించారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

**విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు**

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ చినబడం విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ ఎ.యజ్ఞేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు అంతరాయం కలుగుతుందన్నారు. పెంటిభద్ర, జయరామచంద్రపురం, పద్మనాభపురం, ఓల్డ్ ఎన్‌హెచ్–5 రోడ్డు, తాళభద్ర, నీలావపురం, నర్సిపురం, రైల్వేగేట్ డౌన్, పెసరపాడు, చినబాడం, అంతరకుడ్డ, రాజపురం గ్రామాల ప్రజలు గమనించాలని కోరారు.